క్లుప్తంగా

13న ఐటీఐలో జాబ్‌మేళా

తంబళ్లపల్లె: స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పలు కంపెనీల ప్రతినిధులు హాజరువుతారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా గీతాజయంతి మహోత్సవాలు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఎనిమిది రోజులుగా టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గీతా జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం కళాకారులు గంధర్వరెడ్డి భగవద్గీత 8 అధ్యాయం అక్షర పరంబ్రహ్మ యోగం పారాయణంతో పాటు ప్రవచనాలు బోధించారు. భగవద్గీత పారాయణం విన్న ప్రతి ఒక్కరూ రాబోయే తరాలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు,భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి సంతాపం

కలికిరి: మండలంలోని మేడికుర్తి గ్రామం కొమ్మేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బి.చంద్రశేఖర్ రెడ్డి(57) అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కొమ్మేపల్లికి చేరుకుని చంద్రశేఖర్ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనందరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చెన్నారెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

నేడు మల్లెలలో రెవెన్యూ సదస్సు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మల్లెల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీరాములు నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక


సురేష్‌కుమార్‌రెడ్డి


ప్రసాద్ రెడ్డి

కలికిరి: మండల పరిధిలోని వీఆర్‌ఓలు సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సమావేశమై మండలవసంఘం నూతన అధ్యక్షుడిగా మర్రికుంటపల్లి వీఆర్‌ఓ సురేష్ కుమార్‌రెడ్డిని, ఉపాధ్యక్షుడిగా కలికిరి–1 వీఆర్‌ఓ ప్రసాద్‌రెడ్డిని, కార్యదర్శిగా పారపట్ల వీఆర్‌ఓ నరేష్‌కుమార్‌ను, సంయుక్త కార్యదర్శిగా కలికిరి–4 వీఆర్‌ఓ శిల్ప కుమారిని, కోశాధికారులుగా కలికిరి–3 వీఆర్‌ఓ గౌరీ, మేడికుర్తి వీఆఓ జే.శ్రీనివాసులును ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు తహసీల్దారు మహేశ్వరిబాయికి నియామకపత్రాలను అందజేశారు. వీఆర్‌ఓల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి


తహసీల్దార్ క్రాంతికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న టి.ఎల్. వెంకటేష్

కేవీపల్లె : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం మండలంలోని తిమ్మాపురం గ్రామ సచివాలయం వద్ద తహశీల్దార్ క్రాంతికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదానితో ప్రభుత్వం చేసుకున్న అక్రమ ఒప్పందాన్ని రద్దు చేసి ఆదాని గ్రూప్ ఆఫ్ కంపెనీ అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్న, చెంగన్న, సూరమ్మ, మంగమ్మ, పెద్దన్నదొర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

సంబేపల్లె : చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుమలేసు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని దేవపట్లకు చెందిన తిరుమలేసు సొంత పనుల నిమిత్తం దేవపట్ల వద్ద జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో తన ద్విచక్రవాహనంలో రోడ్డు దాటుతుండగా కలకడ వైపు నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ స్కూటర్‌ను ఢీ కొంది.

సచివాలయాల్లో పనిచేయని ప్రింటర్లు

- ఆధార్ కేంద్రం ఉన్నా లేనట్టే
- పట్టించుకోని అధికారులు
- విద్యార్థులు, ప్రజలకు తప్పని అవస్థలు



ఆధార్ కేంద్రం ఉన్న పెద్దతిప్పసముద్రం సచివాలయం

పెద్దతిప్పసముద్రం: సచివాలయ వ్యవస్థను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కుయుక్తులకు పాల్పడుతోంది. గత ప్రభుత్వంలో ప్రజలకు ఎంతో సేవలందించిన ఈ వ్యవస్థను అదే ప్రజలకు దూరం చేసేలా పావులు కదుపుతోంది. గత ప్రభుత్వంపై ఉన్న అక్కసుతో రూ.కోట్లు ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన యంత్రాలపై కనీస దృష్టి కేంద్రీకరించకుండా మూలన పడేస్తున్నారు.

పనిచేయని ప్రింటర్లు

గత ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్ బ్యాటరీలు, ల్యామినేషన్ మిషన్లు, బయోమెట్రిక్ డివైజ్‌లు, మొబైల్ ఫోన్లతో పాటు సిమ్ కార్డులు, ఐరిష్ స్కానర్‌లతో పాటు కుర్చీలు, టేబుళ్ళు అందజేసింది. ప్రస్తుతం ప్రింటర్లు, ప్రింటర్లలో ఉపయోగించే టోనర్లు సైతం పని చేయకపోవడంతో సచివాలయ సిబ్బంది తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. వాటి మరమ్మతుల గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో సిబ్బంది సైతం దిక్కుతోచక సతమతమైపోతున్నారు. మండలంలో 15 సచివాలయాలు ఉండగా అందులో పెద్దతిప్పసముద్రం, పట్టెంవాండ్లపల్లి, కందుకూరు సచివాలయాల్లో ప్రింటర్లు పని చేయడం లేదు. దీంతో ప్రజలు పక్క గ్రామాలకు వెళ్ళి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాల్సిన దౌర్భాగ్యస్థితి నెలకొంది.

ఈ–సర్వీస్ అకౌంట్ ఎత్తివేత

గతంలో ప్రవేశ పెట్టిన ఈ–సర్వీస్ అకౌంట్స్ సైతం సచివాలయ కార్యదర్శులకు అందుబాటులో లేకుండా కూటమి సర్కార్ చర్యలు తీసుకుంది. ఈ అకౌంట్ ద్వారా సచివాలయంలో కనీస సదుపాయాల కల్పనకు రూ.1000 నుంచి రూ.2 వేలు, రూ.5 వేల వరకు కార్యదర్శులు ఖర్చు పెట్టుకునే సదుపాయం ఉండేది. ఈ నిధుల ద్వారా కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌లు వంటి వాటి మరమ్మతులు చేయించుకునే వెసులుబాటు కార్యదర్శులకు కలిగేది. తాజాగా ఈ సర్వీస్ అకౌంట్ తొలగించడంతో కనీస నిధులు రాక సిబ్బంది సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్ కేంద్రం ఉన్నా లేనట్టే..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే భూ విస్తీర్ణంలో పెద్దతిప్పసముద్రం రెండో స్థానం ఉన్న మండలం. ఇంత పెద్ద మండలానికి ప్రస్తుతం పీటీఎంలో మాత్రమే ఒకే ఒక్క ఆధార్ కేంద్రం ప్రజలకు దిక్కైంది. అయితే గత కొద్ది రోజులుగా సదరు సచివాలయంలోని ప్రింటర్ పని చేయకపోవడంతో ఇటు ప్రజలు, ప్రధానంగా విద్యార్థులు ఇక్కడకు వచ్చి కంటతడి పెడుతూ నిరాశతో వెను తిరుగుతున్నారు. మరి కొందరైతే అష్ట కష్టాలు పడుతూ సత్యసాయి జిల్లాలోని ఆధార్ కేంద్రాలకు వెళుతున్నా ఏ అధికారి కూడా ప్రింటర్స్ మరమ్మతుల గురించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందును పట్టించుకున్నా పాపాన పోలేదు. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా అవసరాలను గుర్తించి సచివాలయాల్లో మరమ్మతులకు గురైన యంత్రాలను బాగు చేసేందుకు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైద్యం చేయకుండానే రెఫర్ చేస్తున్నారు

ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు 108 యూనియన్ సిబ్బంది ఫిర్యాదు


జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదుచేస్తున్న 108 యూనియన్ సిబ్బంది

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి వైద్యులు చికిత్సలు చేయకుండానే సాధారణ రోగులను సైతం రెఫర్ చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ 108 యూనియన్ సిబ్బంది సోమవారం ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ గాయత్రికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సాధారణ కేసులను తిరుపతికి రెఫర్ చేస్తుండటంతో అక్కడి వైద్యులు తమను చులకనగా మాట్లాడుతున్నారని వాపోయారు. ఒకో 108కు నెలలో 50కి పైగా కేసులు రెఫర్ చేస్తుండటంతో స్థానికంగా అత్యవసర సమయాల్లో, ప్రమాదాలు జరిగినప్పుడు, గర్భిణీ కేసులు తరలింపులో జాప్యం జరుగుతోందన్నారు. దీంతో కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యం చూపుతూ, జ్వరం కేసులను కూడా రెఫర్ చేస్తున్నారన్నారు. ఒక 108 వాహనం తిరుపతికి వెళితే, దాదాపు ఏడుగంటల సమయం పడుతోందని, ఆ సమయంలో ప్రమాదాలు జరిగితే మరో 108 అక్కడకు చేరుకునేందుకు గంటకు పైగా సమయం పడుతుందన్నారు. చికిత్సల్లో నిర్లక్ష్యం వహించే రోగులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిజశ్వంత్, గోపి, రఫీ, మస్తాన్, అమరనాథ్, సూరి, సద్దాం, బాబు, మనోహర్, చలపతి, వాణి, హేమరాణి, సంస్కృతి, బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 18 అర్జీలు

తంబళ్లపల్లె: మండలంలో భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నోడల్ ఆఫీసర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. సోమవారం కొటాల పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూకు సంబంధించి 16, భూ సర్వే చేయాలని రెండు అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి అర్జీదారులకు రసీదులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ ఉదయకిరణ్‌కుమార్‌రెడ్డి, ఫారెస్టు బీట రామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి నివాళి


విమలారెడ్డి (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పీ.విమలారెడ్డి (95) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలు ఏపీ రాష్ట్ర మాజీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డికి సమీప బంధువు. ఈమె 1972–1977 వరకు కర్ణాటకలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పని చేశారు. అనంతరం 1995–2001లో టి.సదుం పంచాయతీలో ఏకగ్రీవ మహిళా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈమె భర్త రామక్రిష్ణారెడ్డి ఏపీ కర్షక పరిషత్ జాయింట్ సెక్రటరీగా, ములకలచెరువు ఏఎంసీ చైర్మన్‌గా పని చేశారు. తంబళ్ళపల్లి మాజీ ఎమ్మెల్యే ఏవీ.లక్ష్మీదేవమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై అవగాహన


జ్యోతి వెలిగిస్తున్న శరవణ ముత్తు

కురబలకోట: ప్రపంచమంతటా ఆర్టిఫిషియల్ (ఏఐ)యుగం ముందుకు వస్తోందని గేట్‌వే సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు, సీఈఓ శవరణ ముత్తు పేర్కొన్నారు. అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావంపై సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వివిధ రంగాల్లో దీని వినియోగం క్రమేణా పెరుగుతోందన్నారు. దీని వల్ల వేగవంతంగా పనులు నిర్వర్తించడం జరుగుతుందన్నారు. ప్రపంచంలో వివిధ రంగాలకు ఏఐ పెనుసవాల్‌గా మారనుందన్నారు. సైబర్ సెక్యూరిటీలో కూఆ ప్రాధాన్యత క్రమేణా పెరుగుతోందన్నారు. కొత్త రిస్కులను పరిచయం చేస్తూ డిజిటల్ డేటాలను కాపాడుకోడానికి అసమానమైన అవకాశాలను అందిస్తోందన్నారు.

చెరువు స్థలంలో హెచ్చరిక బోర్డు


కుమ్మరికుంట చెరువు స్థలంలో హెచ్చరిక బోర్డు

కురబలకోట: మండలంలోని తెట్టులోని కుమ్మరికుంట చెరువు స్థలంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ చెరువును చదును చేసి ప్లాట్లు వేసిన విషయాన్ని రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు చెరువు స్థలాన్ని పరిశీలించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు, గ్రామస్థుల కథనం మేరకు వివరాలలోకి వెళితే.. కురబలకోట మండలం తెట్టు శ్రీవేణుగోపాల స్వామి ఆలయం ఎగువ ప్రాంతంలో కుమ్మరికుంట చెరువు పూర్వం నుంచి ఉండేది. ఇందులోకి పెద్దగా నీళ్లు చేరవన్న కారణంగా తెట్టు గ్రామానికి చెందిన ఒక నాయకుడు చెరువును చదును చేసి గ్రామస్థులకు పట్టాలు ఇవ్వాలని సంకల్పించారు. సర్వే నెంబరు 169లో 89 సెంట్లు విస్తీర్ణంలో ఉన్న చెరువును కాస్తా అప్పట్లో జేసీబీతో చదును చేసేశారు. చెరువు ఆనవాళ్లే లేకుండా చేసి ప్లాట్లు కొట్టి గ్రామస్థులకు ప్లాట్లు వేసి ఇచ్చారు. ఏడాదిన్నర క్రితం ఇక్కడ ప్లాట్లు కొన్నప్పటికీ ఎవ్వరూ కట్టడాలు కట్టకపోవడంతో ఖాళీగానే ఉంది. చెరువు ప్లాట్లుగా మారిన విషయాన్ని అధికారుల దృష్టికి గ్రామస్థులు, ఆయకట్టుదారులు తీసుకు వచ్చారు. వెంటనే రెవెన్యూ అధికారులు చెరువును పరిశీలించగా అక్కడ చెరువు లేదు. ప్లాట్లుగా మార్చిన చెరువును చూసి నివ్వెరపోయారు. దీంతో సర్వే నిర్వహించి ఆక్రమిత చెరువు స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకున్నారు. ఇందులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తహసీల్దారు తపస్విని, ఎంఆర్‌ఐ బాలసుబ్రమణ్యం సోమవారం తెలిపారు. తిరిగి కట్టతో పాటు చెరువును నిర్మించాలని అధికారులను గ్రామస్థులు కోరారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి

మదనపల్లె సిటీ: సమాజంలో జరుగుతున్న ఈవ్‌టీజింగ్, బాల్యవివాహాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. సోమవారం కాలేజీలో రాయచోటి వన్‌స్టాప్ సెంటర్ నందిని బాలికలకు ఆత్మరక్షణ, సంక్షేమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమస్యలు ఎదురైతే ఉమెన్ హెల్ప్‌లైన్, బాలికల హెల్ప్‌లైన్ నంబర్ 1098కు, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181ను ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రెడ్డప్పరెడ్డి, అధ్యాపకులు శివపార్వతిదేవి, మురళీధర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓబన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం చూపాలని వినతి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం అధ్యక్షులు, నాయకులు

రామసముద్రం : మండల కేంద్రంలో వడ్డెర ఓబన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం చూపాలని సోమవారం మండల వడ్డెర సంఘం అధ్యక్షులు రెడ్డెప్ప, జిల్లా నాయకుడు వాలెప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ నిర్మలాదేవి, ఎంపీడీఓ భానుప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వడ్డెరల కోసం ఓబన్న ఎంతో కృషి చేశారని, వడ్డెరల జ్ఞాపకార్థం ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని నిశ్చయించామన్నారు. విగ్రహ ఏర్పాటుకు స్థలం చూపాలన్నారు. దీనిపై స్పందించిన అధికారులు స్థలం గుర్తింపునకు సంబంధిత వీఆర్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు కోనంగిమునెప్ప, గంగప్ప, మంజు, సుబ్రహ్మణ్యం, ఈశ్వరప్ప, విశ్వనాథ, వెంకటరమణ పాల్గొన్నారు.

టమాటా ధరలు ఢమాల్



కలకడ : మార్కెట్‌లో టమాట ధరలు సోమవారం ఢమాల్ మన్నాయి. 15 కేజీల బాక్స్ ధర రూ.1250 వరకూ కలకడ టమాటా మార్కెట్‌లో పలికాయి. గత ఏడాది ఏకంగా రూ.2 వేలకు పైగా పలికిన ధరలు ఈ ఏడాది సుమారు ఆరు మాసాల పాటు రూ.వెయ్యి లోపే ధరలు పలికాయి. సోమవారం మాత్రం కేవలం రూ.150 నుంచి రూ.200 మాత్రమే బాక్స్ పలకడంతో సాగుచేసిన పండించిన రైతుల్లో ఆందోళన నెలకొంది. టమాట పంట దిగుబడి తగ్గినా కలకడ మార్కెట్‌కు మాత్రం అధికంగానే కాయలు తీసుకువచ్చారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

మండల ప్రత్యేక అధికారి సాంబశివ

పెద్దమండ్యం: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా హౌసింగ్ పీడీ సాంబశివ అన్నారు. మండలంలోని బండమీదపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం గ్రామ సర్పంచ్ మొలక బయ్యారెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను రైతులు పరిష్కరించుకోవచ్చన్నారు. సదస్సుల్లో భూమి సర్వే, ఆన్‌లైన్‌లో భూముల నమోదు, మ్యుటేషన్ కోసం 37 దరఖాస్తులు రాగా, పింఛన్లు, రేషన్‌కార్డులు ఇతర సమస్యల పరిష్కారం కోసం 34 మంది దరఖాస్తు చేసుకొన్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఆర్ఐ రమేష్, వీఆర్‌వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

మదనపల్లె : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదని, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. సోమవారం ఉదయం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు డివిజన్‌లోని 11 మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై 117 అర్జీలను సమర్పించారు. అందులో ఎక్కువ భాగం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు రావడంతో, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ... భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం డిసెంబర్ 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు ప్రతి పంచాయతీలోనూ నిర్వహిస్తోందని, సమస్యలు ఉన్న రైతులు పూర్తి ఆధారాలతో స్థానికంగా నిర్వహించే రెవెన్యూ సదస్సులో సమస్యలు తెలిపితే, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. భూసమస్యలపై ప్రజలు సబ్ కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండా, స్థానికంగా నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలన్నారు. ఇతర సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేందుకు కృషిచేశారు.

ఆరోగ్య పరీక్షలతో తల్లీబిడ్డ క్షేమం


గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : క్రమం తప్పకుండా గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తలపుల పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం నిర్వహించి గర్భిణులకు పరీక్షలు చేసి, సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా నాలుగు రకాల పరీక్షలు, రెండు టీడీ సూది మందులు, 180 ఐఎఫ్ఏ మాత్రలు లభిస్తాయన్నారు. అలాగే వైద్యులు సూచించిన రక్త పరీక్షలు చేపించుకుని, ఆస్పత్రిలో కాన్పు చేపించుకోవడం ద్వారా తల్లీబిడ్డకు పూర్తి రక్షణ సాధ్యమన్నారు. ఏఎన్ఎం రెడ్డిబీ సహకారంతో 32 మంది గర్భవతులు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు కుసుమ, కృష్ణయ్య, హెచ్ఈ కొండయ్య, ఏఎన్ఎం రెడ్డిబీ, సీహెచ్‌వో లావణ్య, ల్యాబ్ టెక్నీషియన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ సమ్మె నోటీసు


మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపుమేరకు...జీతాల పెంపుదల, ఇతర కార్మిక సమస్యలపై సమ్మెలోకి వెళుతున్నట్లు మదనపల్లె మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నోటీసులు అందజేశారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ కే.ప్రమీలను కలిసి సమ్మె నోటీసుకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో 35 సంవత్సరాలుగా ఇంజినీరింగ్‌శాఖలోని పలువిభాగాల్లో కార్మికులుగా పనిచేస్తున్నప్పటికీ, తమ కనీస కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. దీనిపై పలుమార్లు ప్రభుత్వాలకు విన్నవించుకున్నప్పటికీ, పట్టించుకోకపోవడంతో తమ జీవనప్రమాణాలు ఇబ్బందిగా మారాయన్నారు. రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్‌కు రూ.29,200, రూ.24,500 ఇవ్వాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన ఇంజినీరింగ్ కార్మికులను క్రమబద్ధీకరణ చేస్తూ, సంక్షేమ పథకాలను అమలుచేయాలన్నారు. ఆప్కాస్‌లో నాన్ పీహెచ్ కార్మికులుగా తొలగించి, ఇంజినీరింగ్ కార్మికులుగా నమోదుచేయాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికుడికి రూ.10లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. సమ్మె నోటీసు అందజేసిన వారిలో ఎం.ఎస్.కన్నయ్య, గోపాలకృష్ణ, ఎస్.నాగరాజు, బి.రత్నకుమార్ ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మదనపల్లె : పట్టణ జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్రి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు వర్రి సురేష్‌కుమార్, మస్తాన్ మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో చేపట్టిన మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు హామీల అమలుకు కూటమి ప్రభుత్వం జీఓ విడుదల చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని కోరారు. ఇంజినీరింగ్ విభాగ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, పెండింగ్‌లోని సరెండర్ లీవుల ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలని కోరారు . కరోనా సమయంలో తీసుకున్న డైలీ వేజెస్ వర్కర్స్ కు ఆప్కాస్ వర్కర్స్‌తో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మదనపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు. ఉపాధ్యక్షులు పృథ్వీరాజ్, సహాయ కార్యదర్శి.ముబారక్ ట్రెజరర్ ఇంద్రాణి, వంశీ, కమిటీ సభ్యులు కార్మికులు పాల్గొన్నారు.

బస్సుల కండీషన్ మెరుగుపరచాలి


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎంఈ నరసింహులు

మదనపల్లె సిటీ: ఆర్టీసీ బస్సుల కండీషన్ మెరుగుపరచాలని జిల్లా డిప్యూటీ సీఎంఈ నరసింహులు అన్నారు. సోమవారం మదనపల్లె ఆర్టీసీ–1,2 డిపోల గ్యారేజీ, బస్సుల కండీషన్‌ను తనిఖీ చేశారు. గ్యారేజీలోని ఎంఎఫ్‌లకు ప్రతి రోజు బస్సులను తనిఖీ చేయాలన్నారు. బస్సు కండీషన్ బాగా ఉంటేనే రూట్ మీదకు పంపాలన్నారు. ఎక్కడా రిపేరీలు వంటి రాకూడదన్నారు. డ్రైవింగ్‌లో డ్రైవర్లకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎం మూరే వెంకటరమణారెడ్డి, సీఐలు రేవతి, గీత, ఎంఎఫ్ రవి, డ్రైవర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


టీ మాస్టర్ సుందర్‌కు ఆర్థిక సాయం చేస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: గర్భ సంచి కేన్సర్‌తో బాధపడుతున్న ఓ నిరుపేద మహిళకు హెల్పింగ్‌మైండ్స్ సంస్థ ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. సోమవారం మదనపల్లె పట్టణం బెంగుళూరు బస్టాండులో టీ మాస్టర్‌గా పని చేసే సుందర్ భార్య సరస్వతికి గర్భ సంచి కేన్సర్ ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించారు.దీంతో నిరుపేద కుటుంబం కావవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. మిత్రులు కలిసి రూ.21 వేలు ప్రోగు చేసి సుందరంకు అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్ధిక్, సభ్యులు కిరణ్,ఫయాజ్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఫుట్‌బాల్ జట్టుకు శశికుమార్


శశికుమార్‌ను అభినందిస్తున్న కాలేజీ యాజమాన్యం

మదనపల్లె సిటీ: జెఎన్‌టీయు సౌత్ జోన్ ఫుట్‌బాల్ జట్టుకు స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ బీటెక్ రెండో సంవత్సరం విద్యార్థి శశికుమార్ ఎంపికయ్యాడు. ఇటీవల కుప్పం ఇంజినీరింగ్ కాలేజీలోని ర్వహించిన జెఎన్‌టీయుఏ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీల్లో ఎంపికయ్యాడు. సోమవారం కాలేజీలో విద్యార్థి శశికుమార్‌ను కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, చైర్మన్ రామమోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్, అధ్యాపకులు అభినందించారు.